## క్లుప్తంగా

### చైర్‌పర్సన్ నూతన చాంబర్ ప్రారంభం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌కు నూతన చాంబర్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఏకదాశి సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పూజలు నిర్వహించి నూతన చాంబర్‌లో కూర్చున్నారు. వేదపండితుడు వేంకటేష్ సమక్షంలో పూజలు చేపట్టారు. కౌన్సిలర్‌లు తాటి హస్మండ్లు, జనార్దన్ రాజు, వనం శేఖర్, లింగంపల్లి భాగ్య శివ, నాయకులు పండిత్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

### విజేతలకు బహుమతుల ప్రదానం



నవీపేట: ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు శుక్రవారం సర్పంచ్ ఆసోల్ల శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులను అందజేశారు. అలాగే ఉత్తమ ఆశావర్కర్‌గా ఎంపికైన అంకితను సన్మానించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ వడ్డె రవి, మెడికల్ ఆఫీసర్‌లు కావ్య, అరవింద్, సూపర్‌వైజర్ కిషన్, ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

### రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలి



బాల్కొండ: మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలను మానుకోవాలని వేంపల్లి సహకార సంఘం చైర్మన్‌జక్క రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండలం వేంపల్లిలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందడి అయిపోయిన తర్వాత గ్రామాల్లో ప్రజలు అన్నదమ్ముల కలిసిమెలిసి ఉంటున్నారని చెప్పారు. అలాంటి వాతావరణాన్ని చెడగొట్టి ప్రజలు తన్నుకునేల రెచ్చగొట్టి మాజీ మంత్రి ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని చెప్పుకుంటే తప్పులేదన్నారు. కానీ అప్పుడే పురుడు పోసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదన్నారు. మాజీ సర్పంచ్ మల్కన్న, నాయకులు గంగమల్లు, సరికెల చిన్న గంగారాం, జగదీశ్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సాదాసీదాగా మండల సమావేశం



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల సర్వ సభ్య సమావేశం సాదా సీదాగా జరిగింది. శుక్రవారం ఎంపీపీ గౌతమి అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు హాజరై తమ పురోగతి నివేదికలను చదివి వినిపించారు. చౌట్‌పల్లి బీసీ హాస్టల్ సమీపంలో మురికి కాలువలో విద్యుత్ స్తంభం వేయడం వల్ల కాలువలో చెత్త చెదారంతో పాటు, మురికి నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వార్డెన్ మనోహర్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఏఎంసీ చైర్మన్ గున్వీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కాలేరు శేఖర్, ఎంపీడీఓ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

### అనాథలను ఆదుకోవడం అభినందనీయం



పెర్కిట్: ఆకలితో అలమటించే అనాథలను ఆదుకుంటున్న కరుణ ట్రస్టు సేవలు అభినందనీయమని చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మధుశేఖర్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఎంజే ఆస్పత్రిలో శుక్రవారం కరుణ ట్రస్టు లోగోను డాక్టర్ మధుశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ట్రస్టు ద్వారా మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. కరుణ ట్రస్టు చైర్మన్ మహేశ్‌కుమార్, సభ్యులు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# రోడ్డుపై సంతతో తిప్పలు

- ఇబ్బందులు పడుతున్న విక్రయదారులు, కొనుగోలుదారులు
- నిరుపయోగంగా రైతుబజార్
- పట్టించుకోని అధికారులు



రోడ్డపైనే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

ఆర్మూర్ టౌన్: వ్యాపార సముదాయానికి అడ్డాగా మారిన ఆర్మూర్ సంతలో సమస్యలు నెలకొన్నాయి. ఆర్మూర్ మున్సిపల్ సమీపంలో గల అంగడి బజార్‌లో ప్రతి బుధవారం పెద్ద ఎత్తున సంత జరుగుతుంది. చుట్టు పక్కల 60 గ్రామాల నుంచి రైతులు, చిరు వ్యాపారులు, ప్రజలు అంగడికి వస్తారు. అయితే సంతను రోడ్డుపైనే నిర్వహిస్తుండటంతో విక్రయదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో రైతు బజార్ నిర్మించినా ఇంకా రైతులకు అప్పగించలేదు. దీంతో రైతులు రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. ప్రతి సంవత్సరం మున్సిపల్ పరిధిలో సంతలో సౌకర్యాల కోసం తైబజారు వేలం వేయగా లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుంది. ప్రతిరోజు తైబజార్ కడుతున్నామని.. అయినా కావలసిన కనీస సదుపాయాలు కల్పించడం లేదని రైతులు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. సంతలో మూత్రశాలలు లేవు. తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు అంగడిలో రోజురోజుకు దొంగలు రెచ్చిపోతున్నారు. సంతకు వచ్చే వారి జేబులను ఖాళీ చేస్తున్నారు. ఇలా ప్రతి బుధవారం సంతలో సుమారు 10 వరకు ఫోన్లు పోతున్నాయి. అసలే ఇరుకురోడ్డులో సంత నిర్వహణ, ఆపై ఆటోలు, కార్లు సైతం సంతలోకి తీసుకురావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయి. అంగడి రోజు పోలీసులు పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సంతలో సమస్యలను పరిష్కరించాలని, దొంగతనాలు నివారించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని ప్రజలకు కోరుతున్నారు.

#### సమస్యలను పరిష్కరిస్తాం



ఆర్మూర్ అంగడి బజార్‌లో తాగునీరుతో పాటు మౌలిక సదుపాయలు కల్పిస్తాం. వ్యాపారులకు ఇబ్బందులు కల్గకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటాం. పోలీస్ అధికారులతో చర్చించి సంతలోకి ఆటోలు రాకుండా చూస్తాం.

– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

# కొత్త మండలాల్లో బీఆర్‌ఎస్‌కు నిరాశ

- కాంగ్రెస్‌కు పట్టం కట్టిన ఓటర్లు

మోర్తాడ్: కొత్తగా ఏర్పాటైన మండలాల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఇచ్చారు. మండలాల ఆకాంక్షలను నెరవేర్చిన బీఆర్‌ఎస్‌ను కాదని కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలిసారి 2016లో కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా బాల్కొండ నియోజకవర్గంలో ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల మండలాలు ఆవిర్భవించాయి. ఈ ఎన్నికల్లో ఆయా పార్టీల అభ్యర్థులకు పోలైన ఓట్లను పరిశీలిస్తే కొత్త మండలాల ఓటర్లు తమ ఆకాంక్షలను నెరవేర్చిన బీఆర్‌ఎస్‌కు కాకుండా కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం విశేషం. ముప్కాల్ మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డికి, బీఆర్‌ఎస్ అభ్యర్థి కంటే 2,008 ఓట్లు ఎక్కువ వచ్చాయి. మెండోరా మండలంలో కాంగ్రెస్‌కు 1,927 ఓట్లు, ఏర్గట్ల మండలంలో 895 ఓట్లు కాంగ్రెస్‌కు ఎక్కువ లభించాయి. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డి విజయం సాధించినా కొత్త మండలాల్లో మాత్రం ఆ పార్టీకి తక్కువ ఓట్లు రావడం, కాంగ్రెస్‌కు మెజార్టీ దక్కడం విశేషం అని చెప్పవచ్చు.

# బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కెనరా బ్యాంకు ఆర్‌ఎం శ్రీనివాస్‌రావు

రెంజల్(బోధన్): బ్యాంకులు అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు ఆర్‌ఎం శ్రీనివాస్‌రావ్ సూచించారు. రెంజల్ బ్రాంచి శిథిల దశకు చేరడంతో నూతనంగా నిర్మించిన భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఖాతాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా స్థానిక బ్యాంకు మేనేజర్ సంతోష్ మాట్లాడుతు బ్యాంకు లావాదేవీలను చదివి వివరించారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతు ఖాతాదారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే బ్యాంకర్లు నమ్మకంతో మరింత మందికి అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీసీ) చేసుకున్న వినియోగదారులకు కెనారా బ్యాంకులో తిరిగి రుణాలను అందిస్తున్నట్లు వివరించారు. ఖాతాదారుల నుంచి తీసుకున్న డిపాజిట్లనే మిగిలిన వారికి రుణాలుగా చెల్లిస్తామని ఏజీఎం నికుల్స్ కుమార్ తెలిపారు. బ్యాంకుల ద్వారా పొందిన రుణాలతో ఆర్థిక ప్రగతిని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మర్ల రమేష్‌కుమార్, రాజు, మాజీ జెడ్పీటీసీ జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కిషోర్, ధనుంజయ్, రఫీక్, రీజనల్ ఆఫీస్ సీనియర్ మేనేజర్ రత్నాకర్, మేనేజర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): ఎవరైన పోకిరీలు మహిళలు, అమ్మాయిలతో అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన తమకు సమాచారం ఇవ్వాలని షీ టీం కానిస్టేబుళ్లు విగ్నేష్, సుమతి సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లు మాట్లాడుతూ వేధింపులకు గురైన బాధితులు షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచి పోకిరీలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధితులు 8712659795, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం ఆజాద్ రహ్మాన్ పాల్గొన్నారు.

### ఆరోగ్య శిబిరాల ఏర్పాటు



నందిపేట్: నందిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. నందిపేటలోని శ్రీ కేదారీశ్వర ఆశ్రమంలో ఆయుర్వేద ఆరోగ్య శిబిరాన్ని, నందిపేట మండలం లక్కంపల్లి శివారులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడాల వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అలాగే నందిపేట పీహెచ్‌సీలో గర్భిణులకు పోషకాహార కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమాలలో డాక్టర్లు ప్రవీణ్, శ్రావణి, నయన, ప్రవీణ, పీహెచ్‌ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్, ఫార్మసిస్టు రవి, గిరిధర్ ఉన్నారు.

### ఘనంగా అయ్యప్ప పడిపూజ

నందిపేట్: నందిపేటలోని శ్రీ కేదారీశ్వర ఆశ్రమంలో గురుస్వామి మాడ మల్లేష్ స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం మహా మండల పడి పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గూడెం గురుస్వామి, శ్రీ కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ సమక్షంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు మహా అభిషేకం చేపట్టారు. అనంతరం జ్యోతులను వెలుగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గురుస్వాములను మల్లేశ్ స్వామి సన్మానించారు.



అయ్యప్పకు అభిషేకం చేస్తున్న మాలధారులు

### పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



ఆర్మూర్‌టౌన్: ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆర్మూర్ పట్టణ పర్యవేక్షకుడు చంద్రశేఖర్ అన్నారు. పట్టణ ఆరోగ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వివిధ కాలనీల్లో ప్రతి శుక్రవారం ఫ్రై డే, డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటి చూట్టు నీరు నిలువ ఉండటంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, చికెన్ గన్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. చలికాలంలో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సబ్‌యూనిట్ అధికారి సాయి, పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది అనురాధ, కమల, రాజవ్వ ,స్వాతి, విజయశ్రీ పాల్గొన్నారు.

# నాయకులు ఓ వైపు.. ఓట్లు మరో వైపు

మోపాల్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు, ముఖ్య నాయకుల ఊళ్లల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారు. బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులైన బాజిరెడ్డి గోవర్ధన్, దినేష్ కులాచారి సొంతూర్లలో ఇతర పార్టీలకు ఆధిక్యం వచ్చింది. వీరితోపాటు ముఖ్య నాయకుల ఊళ్లల్లోనూ ప్రజలు ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు అధికంగా ఓట్లు వేసి ఖంగు తినిపించారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి సొంతూరు జలాల్‌పూర్‌లో 208 ఓట్లు ఆయనకు లీడ్ వచ్చింది. అలాగే మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు మండవ వెంకటేశ్వర్‌రావు స్వగ్రామమైన ధర్మారం (బి)లో 872 ఓట్లు, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బీన్ హందాన్ గ్రామమైన సిరికొండలో 688 ఓట్లు కాంగ్రెస్ పార్టీ ఆధిక్యాన్ని కనబర్చింది. పీసీసీ ప్రధాన కార్యదర్శి కాట్‌పల్లి నగేష్‌రెడ్డి గ్రామం ముల్లంగి (ఐ)లో కాంగ్రెస్‌కు కేవలం 17 ఓట్లు ఆధిక్యం రాగా, బీఆర్‌ఎస్ మూడోస్థానంలో నిలిచింది.

- బాజిరెడ్డి గోవర్ధన్ స్వగ్రామమైన రావుట్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ ఆర్ భూపతిరెడ్డికి 162 ఓట్లు అధికంగా వచ్చాయి. బీజేపీ మూడోస్థానంలో సరిపెట్టుకుంది.
- బీజేపీ అభ్యర్థి దినేష్ కులాచారి స్వగ్రామమైన అమృతాపూర్‌లో బీఆర్‌ఎస్ ఆధిక్యాన్ని కనబర్చింది. 176 ఓట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు అధికంగా వచ్చాయి. దినేష్ కులాచారి రెండోస్థానానికి పరిమితం అయ్యారు.
- మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకులు అరికెల నర్సారెడ్డి సొంతూరు సింగంపల్లిలో 8 ఓట్లతో బీఆర్‌ఎస్ అభ్యర్థి ముందంజలో ఉన్నారు. 345 ఓట్లు బీఆర్‌ఎస్‌కు రాగా, ఆ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డికి 337, బీజేపీ అభ్యర్థి దినేష్‌కులాచారికి 300 ఓట్లు వచ్చాయి.
- మాజీ ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీజీ గౌడ్‌స్వగ్రామమైన రాంపూర్‌లో బీజేపీ ఆధిక్యాన్ని కనబర్చింది. 257 ఓట్లు బీజేపీకి లీడ్ వచ్చింది. 1340 ఓట్లు బీజేపీకి రాగా, ఆ గ్రామంలో బీఆర్‌ఎస్‌కు 1083 ఓట్లు, కాంగ్రెస్‌కు 819 ఓట్లు వచ్చాయి.
- నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి గ్రామం బోర్గాం(పి)లో బీజేపీకి 145 ఓట్లు అధికంగా వచ్చాయి. బీఆర్‌ఎస్ 1385 ఓట్లతో మూడోస్థానంలో సరిపెట్టుకుంది. బీజేపీకి 1906 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 1761 ఓట్లు వచ్చి రెండోస్థానంలో నిలిచింది.

# విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్‌అర్బన్: బోర్గాం(పి) ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ నాయకులు జన్నారపు రాజేశ్వర్, మహేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఫుడ్‌పా యిజన్ ఘటనలు తరచూ జరుగున్నా అరికట్టడంతో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. మనోజ్, రవి తేజ, రాజు, వంశీ పాల్గొన్నారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎడపల్లి: ఎడపల్లిలో శుక్రవారం పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. నిజామాబాద్ వైపు నుంచి బోధన్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్‌లో 18 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. డ్రైవర్ వేణుపై కేసు నమోదు చేశామన్నారు.

# విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న కళ్యాణ్

నిజామాబాద్ అర్బన్: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీవీపీ (తెలంగాణ విద్యార్థి పరిషత్)జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్, నగర అధ్యక్షుడు అఖిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ..రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 5300కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తెలంగాణ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలని కోరారు. ఈ సమావేశంలో అఖిల్, సోహెల్, మహేష్, సుజిత్, అమన్, చందు పాల్గొన్నారు.

**విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలి**

నిజామాబాద్‌అర్బన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం చొరవ చూపాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. గత ప్రభుత్వంలో నిరాధరణకు గురైన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బోధన్‌టౌన్: ఆటో డ్రైవర్లు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బోధన్ పట్టణ సీఐ వీరయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు పక్కన ఆటోలు నిలుపరాదని సూచించారు. ఆటో నెంబర్‌తో పాటు సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లైన చక్కర్‌నగర్ చౌరస్తా, పెగడపల్లి చౌరస్తా, కొత్త బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా, పాత బస్టాండ్లలో రోడ్డు పక్కన ఆటోలు నిలుపరాదని, ప్రజలకు ఇబ్బంది కల్గించొద్దని సూచించారు.

### నూతన ప్రభుత్వానికి అభినందనలు

ఖలీల్‌వాడి: నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వానికి సీపీఎం జిల్లా కమిటీ పక్షాన అభినందనలు తెలుపుతున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో వివిధ సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి తెలియజేయాలని పార్టీ సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించటంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను అమలు జరపడంతో పాటు ప్రజా హక్కులను కాపాడాలని ఆయన కోరారు. ఆరు గ్యారంటీలను అమలు జరపాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించని ఎడల కొంతకాలం వేచి చూసిన తర్వాత పోరాటాలు చేస్తామన్నారు. పెద్ది వెంకట్ రాములు, పల్లపు వెంకటేష్, జై శంకర్ గౌడ్, గంగాధర్, నూర్జహాన్ పాల్గొన్నారు.

### నిమిషాంబ దేవి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

బాల్కొండ: బాల్కొండలోని నిమిషాంబ దేవి ఆలయంలో కార్తీక మాస చివరి శుక్రవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశఋారు. నకాశీ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

**సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్**



**పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)**

- స్క్రీన్-1 – ఎక్స్‌ట్రా ఆర్డినరి మెన్(తెలుగు)-9.40; యానిమల్(హిందీ) 1.00, 5.00, 9.00
- స్క్రీన్-2 – హాయ్ నాన్న (తెలుగు)- 09.30, 12.45, 4.00, 7.15, 10.30
- స్క్రీన్-3 – ఎక్స్‌ట్రా ఆర్డినరి మెన్(తెలుగు)- 11.50, 3.10, 6.30, 9.50
- స్క్రీన్-4 – యానిమల్(తెలుగు)- 10.00, 2.00, 6.00, 9.00

# 'డబుల్' ఇళ్లకు కరెంట్ కష్టాలు



ఇందల్వాయిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

ఇందల్వాయి: డబుల్ బెడ్ రూం ఇళ్లు అందుకున్న లబ్ధిదారుల ఆశలు ఆదిలోనే అడియాసలయ్యాయి. ఎన్నో ఆశలతో ఇంట్లోకి ప్రవేశించిన లబ్ధిదారులు ఇళ్లకు కరెంట్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇందల్వాయిలో 30.14 కోట్ల రూపాయలతో 48 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. ఎన్నో ఆటంకాల అనంతరం వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు.పంపిణీ చేసి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు వాటికి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వలేదు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోటారు పనిచేయక నీటి సరఫరా కూడా జరగడం లేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం నిత్యం అనేక తిప్పలు పడుతున్నామని, రాత్రి వేళల్లో చార్జింగ్ లైట్లు, బ్యాటరి బల్బులు వాడుతున్నట్లు తెలిపారు. ఇళ్ల సముదాయం చుట్టూ ప్రహరీ లేక పోవడంతో అభద్రతకు లోనవుతున్నట్లు తెలిపారు.

**పట్టించుకోని అధికారులు**

రెండు నెలలుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. సమస్యల పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. స్థానిక విద్యుత్ అధికారులను అడిగితే పైస్థాయిలో సమస్య ఉందని తీరడానికి కొంత కాలం పడుతుందని తెలిపినట్లు లబ్ధిదారులు వాపోతున్నారు.

#### కష్టాలు పడుతున్నాం

మాకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కరెంట్ సౌకర్యం లేదు. దీంతో నీటి సరఫరా కూడా కావడం లేదు. పైన పోర్షన్‌లలో ఉన్నవారు నీటిని పైకి తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు.రాత్రి వేళల్లో అంధకారంలో గడుపుతూ చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– విజయలక్ష్మి, ఇందల్వాయి

#### రూ.ఆరు లక్షలు రావాల్సి ఉంది

గృహ నిర్మాణాలు చేపట్టిన ఆర్అండ్‌బీ శాఖ నుంచి విద్యుత్ శాఖకు సుమారు రూ.ఆరు లక్షలు రావాల్సి ఉంది. వారు చెల్లింపు ప్రక్రియ పూర్తి చేసిన ట్రెజరి డిపార్ట్‌మెంట్‌లో నిధులు నిలిచిపోయాయి. మా సంస్థ ఖాతాలో డబ్బులు జమ కాగానే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్ అందించే పనులు ప్రారంభిస్తాం.త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.

– పండరినాథ్, విద్యుత్ శాఖ ఏఈ, ఇందల్వాయి